## క్లుప్తంగా

### కోతలకు సిద్ధంగా నువ్వు చేలు



కొలిమేరులో నువ్వు పంట

**తుని రూరల్:** మెట్ట ప్రాంతంలో నువ్వు చేలు కోతకొచ్చాయి. వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్‌లో రబీలో సాగునీటి సౌకర్యం లేని గ్రామాల్లో రైతులు నువ్వుసాగు చేపట్టారు. కాకినాడ జిల్లాలో 1150 ఎకరాల్లో నువ్వు పంట సాగవుతుండగా తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 265 ఎకరాల వరకూ రైతులు సాగు చేస్తున్నట్టు వ్యవసాయ సహాయక సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. పంట పక్వానికి రావడంతో ఏప్రిల్ రెండో వారం నుంచి కోతలు జరుగనున్నట్టు ఆయన తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడులు లభిస్తాయన్నారు.

### మండుటెండలోనూ లోవకు భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**తుని రూరల్:** వేసవికాలం మండుటెండలోనూ లోవ దేవస్థానికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. ఆదివారం వివిధ జిల్లాలకు చెందిన పది వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. రవ్వలడ్డూ, పులిహోరం ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.1,09,470, పూజా టికెట్లకు రూ.88,960, కేశఖండనశాలకు రూ.12,280, వాహన పూజలకు రూ.8,490, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.43,432, విరాళాలు రూ.46,476, వెరసి మొత్తం రూ.3,09,108 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

### తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తండ్రి శ్రీకాంత్ చెంతకు చేరిన వర్షిత్

**తుని:** ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని తుని పట్టణ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం జరిగిన సంఘటనకు సంబంధించి తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొండవారిపేటకు చెందిన నాలుగేళ్ల బాలుడు చితకల వర్షిత్ ఇంటి నుంచి తప్పిపోయి శాంతినగర్‌కు చేరాడు. బేలగా చూస్తున్న బాలుడిని స్థానికలు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం మేరకు వర్షిత్ తండ్రి శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో ఉన్న బాలుడిని పోలీసులు తండ్రికి అప్పగించారు. చిన్న పిల్లల విషయం జాగ్రత్తగా ఉండాలని సీఐ గీతా రామకృష్ణ సూచించారు.

### రైలు నుంచి జారిపడి మహిళ మృతి

**తుని:** అన్నవరం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ(35) మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అన్నవరం స్టేషన్–రైల్వేగేటు మధ్యలో సామర్లకోట నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి మహిళ జారిపడి అక్కడికక్కడే మృతి చెందింది. ముక్కుపొడుం రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉందని, చుట్టు పక్కల స్టీల్ గిన్నెలు పడి ఉన్నాయి. మృతురాలి వివరాలు తెలియలేదని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై చెప్పారు.

### ఫీజు రీయింబర్స్‌మెంటుతో చదివి.. పీహెచ్‌డీ సాధించి..

**పిఠాపురం:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంటుతో చదివి పీహెచ్‌డీ సాధించినట్లు కొత్తపల్లి మండలం అమరవిల్లికి చెందిన కోనపల్లి పాన్నీ తెలిపారు. విజయనగరం సిల్లాలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసి మంచినీటిగా మార్చి ప్రజలకు ఉపయోగకరంగా మార్చే విధానంపై పరిశోధన చేసినట్లు ఆమె తెలిపారు. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆదివారం పీహెచ్‌డీ పట్టా అందుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఫీజు రియంబర్స్‌మెంటు పథకం లేకపోతే తాను పెద్ద చదువులు చదువుకుని పీహెచ్‌డీ సాధించే అవకాశం ఉండేది కాదని ఆయన చొరవ వల్లే తాను ఈ ఘనత సాధించినట్టు ఆమె తెలిపారు. ఆమెను గైడ్ చేసిన సాల్మాన్‌రాజు, ఆమె తండ్రి కోనపల్లి సత్యనారాయణరెడ్డి ఇతర బంధువులు అభినందించారు.

# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- సమస్యాత్మక ప్రాంతాలలో నిరంతర నిఘా
- ఎన్నికల నిర్వహణ అధికారి శ్రీనివాసరావు



**ప్రత్తిపాడు రూరల్:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించినట్టు నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నమన్నారు. ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై అప్రమత్తంగా ఉంటున్నామని తెలిపారు. అనుమతులు కావాలంటే 48 గంటల ముందు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీవిజిల్ యాప్ ద్వారా ఎవరైనా ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. కేంద్రాల్లో ఏర్పాట్లను బూత్ లెవెల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని, ఈవీఎంలు మొరాయించకుండా, పోలింగ్ సమయంలో ఇతర సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణతోపాటు పలు అంశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

**ఇంటి వద్దే ఓటేసే అవకాశం**

పోలింగ్ కేంద్రాలకు రాలేని వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సదుపాయం ఎన్నికల కమిషన్ కల్పిస్తోంది. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇందుకోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అవకాశం కల్పిస్తారు.



ప్రత్తిపాడులో ఎన్నికల అధికారి కార్యాలయం

**సీ విజిల్ యాప్‌తో ఫిర్యాదులు**

రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే ఆయా ప్రాంతాలకు సిబ్బంది చేరుకుని చర్యలు తీసుకుంటారు. ముఖ్యంగా ఫిర్యాదు చేసేవారి పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతాం. అందువల్ల ఎవరైనా ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు.

**సమస్యాత్మక కేంద్రాలపై నిఘా**

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో 45 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల విషయంలో మరింత జాగ్రత్తతో వ్యవహరిస్తున్నాం. నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతాల్లో వీడియోల చిత్రీకరణతో పాటు పోలీసుల బందోబస్తు కూడా ఎక్కువగా ఉంచాం.

**కోడ్ పక్కాగా అమలు**

కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పక్కాగా అమలు చేస్తున్నాం. అన్ని ప్రాంతాల్లోని రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించాం. శిలాఫలకాలు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగాం. కోడ్ నిబంధనలు రాజకీయ పార్టీలతోపాటు ప్రతి ఒక్కరూ పాటించాలి. ప్రభుత్వ ఆస్తులపై జెండాలు కట్టకూడదు. ప్రైవేటు ఆస్తులపై కట్టాలంటే వాటి యజమానుల నుంచి అనుమతి తీసుకోవాలి. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తక్షణమే అందుబాటులో ఉన్న కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య ఉంటే 08868–294210కు కాల్ చేయవచ్చు. అక్కడి సిబ్బంది నమోదు చేసుకుని మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.


**ప్రత్తిపాడు మోడల్ పోలింగ్ స్టేషన్లు**

ప్రత్తిపాడు మెయిన్ స్కూల్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం.

**అనుమతులు తప్పనిసరి**

ప్రచారానికి సంబంధించి పార్టీల కార్యాలయాల ఏర్పాటు, వాహనాలు, సభల నిర్వహణ, ప్రచారానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా సువిధ యాప్ ద్వారా అవసరమైన అనుమతులు తీసుకోవాలి. 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం. ఎటువంటి రుసుం చెల్లించాల్సినవసరం లేదు. ఖర్చులన్నీ పార్టీల ఖాతాలో జమవుతాయి. పార్టీ అభ్యర్థుల ఖర్చుపై నిరంతర నిఘా ఉంటుంది. ప్రతి విషయాన్ని నమోదు చేసుకుంటాం.

### నియోజకవర్గ ముఖ చిత్రం



ఇదీ ప్రత్తిపాడు నియోజకవర్గ స్వరూపం

| | |
|---|---|
| జనాభా | 2,19,544 |
| పురుషులు | 1,45,629 |
| స్త్రీలు | 1,45,915 |
| ఓటర్లు | 2,15,023 |
| పురుషులు | 1,06,089 |
| స్త్రీలు | 1,08,913 |
| ఇతరులు | 21 |
| పోలింగ్ బూత్‌లు | 227 |
| పోలింగ్ లొకేషన్లు | 130 |
| సెక్టార్ ఆఫీసర్లు | 23 |
| రూట్ ఆఫీసర్లు | 31 |
| సమస్యాత్మక గ్రామాలు | 45 |

### నేడు మంత్రి రాజా పర్యటన

**కోటనందూరు:** మండలంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. కేఓ అగ్రహారంలో సాయంత్రం నాలుగు గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### శాంతియుత ఎన్నికలకు సహకరించాలి



కృష్ణవరంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

**కిర్లంపూడి:** శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని డీఎస్పీ లతాకుమారి కోరారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కృష్ణవరంలో ఆదివారం సాయంత్రం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని లతాకుమారి కోరారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రాత్రి కృష్ణవరంలోనే బస చేశారు. స్థానిక ఏఎస్సైలు బలరాం, కుమార్, హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు, రైటర్ ఎస్‌వీ రమణ, కానిస్టేబుల్స్ శివ, గణేష్, శ్రీనివాస్, సెక్రటరీ నూకరాజు ఉన్నారు.

# సంక్షేమ పథకాల కొనసాగింపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల
- అప్పన్నపాలెంలో ఎన్నికల ప్రచారం

**ఏలేశ్వరం:** రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగింపే తమ లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణ పరిధిలోని అప్పన్నపాలెంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు కొనసాగిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్ని కుట్రలు పన్నినా తమ విజయాన్ని అపాలేరన్నారు. కూటమి ప్రజల్లో విశ్వసనీయత లేదన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టిన సీఎం జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు బాసటగా నిలవాలన్నారు. తొలుత గడపగడపకూ వెళ్లి తమ పార్టీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డేగల వెంకటరమణ, శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, తొండారపు రాంబాబు, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.



అప్పన్నపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

# సంక్షేమ ప్రదాత జగనన్నను ఆశీర్వదించండి

**తుని:** ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికార పీఠంపై కూర్చుబెట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. ఆదివారం సాయంత్రం తుని పట్టణం 17వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద మహిళలు శంకర్ మల్లిక్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లిక్ గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, పట్టణంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మంత్రి దాడిశెట్టి రాజా తుని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అగ్ర స్థానంలో నిలిపారని శంకర్ మల్లిక్ అన్నారు. సంక్షేమ, అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జేసీఎస్. కన్వీనర్ పామర్తి మహేష్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుని పట్టణం 17వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్ మల్లిక్, నాయకులు

# పింఛన్ల పంపిణీలో వలంటీర్లను అడ్డుకోవడం దారుణం

**ఏలేశ్వరం:** ఎప్పుడూ పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లను అడ్డుకోవడం దారుణమని, టీడీపీ తన చెత్త బుద్ధి చూపించిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఆరోపించారు. సంక్షేమ పథకాలు అందజేయకుండా వలంటీర్లపై టీడీపీ తన వ్యక్తుల ద్వారా ఫిర్యాదు చేయడంపై వరుపుల ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగంపర్తి గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లపై ఈసీలకు ఫిర్యాదు చేయించడం దుర్మార్గమన్నారు. నిరుపేదలను ఇబ్బందులకు గురి చేస్తున్న టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ఘోర ఓటమి తప్పదన్నారు. గత ప్రభుత్వంలో పదో తారీకు వరకు పింఛన్లు ఇవ్వడి టీడీపీ ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పై తన అక్కసును వెళ్లకక్కిందన్నారు. వలంటీర్ల పై ఈసీ తన నిర్ణయాన్ని పునరాలించుకోవలని ఆయన కోరారు.

# వైఎస్సార్ సీపీలో చేరికలు

కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి రాజా

**తుని:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై టీడీపీకి చెందిన పలువురు కీలక నాయకులు వైఎస్సార్ సీపీకి చేరుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఆదివారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో టీడీపీ ఎస్సీసెల్ తుని పట్టణశాఖ అధ్యక్షుడు దిబ్బ శ్రీను తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరవరపుపేటకు చెందిన దిబ్బ శ్రీనుతో పాటు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరడంతో టీడీపీకి షాక్ తగిలింది. టీడీపీలో కష్టపడిన పని చేసిన వారికి గుర్తింపు లేదని, వైఎస్సార్ సీపీ చేసిన పథకాలు, మంత్రి దాడిశెట్టి రాజా పనితీరుకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్టు శ్రీను తెలిపారు. తునిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా విజయానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని, వైఎస్సార్ సీపీ సింగిల్‌గానే పోరాటం చేస్తోందన్నారు. తుని నియోజకవర్గంలో మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, కౌన్సిలర్ పులి సత్యనారాయణ, శివకోటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన దిబ్బ శ్రీను, కార్యకర్తలతో మంత్రి దాడిశెట్టి రాజా

### పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

**శంఖవరం:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

# పింఛన్ల పంపిణీని అడ్డుకున్న పచ్చపార్టీ

- జగ్గంపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- ఇర్రిపాకలో పార్టీ ఆత్మీయ సమావేశం

**జగ్గంపేట:** ప్రతి నెల ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా పేదలకు ప్రభుత్వం అందించే పింఛన్లను ఇవ్వకుండా దుష్టశక్తులు అడ్డు పడ్డాయని జగ్గంపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో తిర్రి వీరబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తోట నరసింహం మాట్లాడుతూ పేదలకు ప్రతినెల అందే పింఛన్లను అందకుండా పచ్చ పార్టీ కుట్ర పన్నిందని ఆయన విమర్శించారు. ఏలేరు నదిని ఆనుకుని ఉన్న ఇర్రిపాకలో రైతాంగం సాగునీరు లేక అవస్థలు పడుతున్నారని విమర్శించారని, దీనికి గత పాలకులు కారణమని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ ఆయన్ని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని తెలిపారు. జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. యువనేత తోట రాంజీ, నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట మండల వైఎస్సార్ సీపీ నేత బండారు రాజా, ఇర్రిపాక సర్పంచి తిర్రిదేవి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



ఇర్రిపాక ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోటనరసింహం

# ఘనంగా ఈస్టర్ వేడుకలు

**చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు**

**ఏలేశ్వరం:** యేసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి రాకను పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జీసస్ గీతాలు ఆలపిస్తూ రోజంతా చర్చిల్లో గడిపారు. స్థానిక కాలేజ్ రోడ్‌లోని లూథరన్ చర్చిలో పాస్టర్ రెవ. ప్రశాంత్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల్లో పేకలజాన్, శాంతి సుధ, జ్యోతిరాజు, శేఖర్, అస్మాండ్, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ పాపులను రక్షించేందుకు క్రీస్తు మరల జన్మించాడన్నారు. క్రీస్తుబోధనలు అనుసరణీయమన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ థామస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, సంఘస్తులు, సంఘ విశ్వాసకులు పాల్గొన్నారు.

**తుని రూరల్ మండలంలో..**

**తుని రూరల్:** మండలంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి ఆరోగ్యమాత ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ బాలశౌరి ఆధ్వర్యంలో క్రీస్తు పునరుద్ధన, జాగరణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్ రాయి మేరీఅవినాష్, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు. తేటగుంట, ఎస్.అన్నవరం, డి.పోలవరం, రేఖవానిపాలెం, లోవకొత్తూరు తదితర గ్రామాల్లో ఈస్టర్‌ను జరుపుకొన్నారు.



ఏలేశ్వరం లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

**ప్రత్తిపాడు మండలంలో...**

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలో క్రైస్తవులు ఈస్టర్ పండగను ఘనంగా జరుపుకొన్నారు. చర్చిల్లో ఆదివారం తెల్లవారుజామున నుంచే ప్రార్థనలు చేశారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, గజ్జనపూడి, చింతలూరు, పోతులూరు తదితర గ్రామాల్లోని చర్చిలలో మత పెద్దలు ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. ధర్మవరం బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చ్ ఫాదర్ ఊబ కృపావరం ఆధ్వర్యంలో శ్మశాన వాటికల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

**భక్తిశ్రద్ధలతో...**

**గోకవరం:** క్రీస్తు రాకను పురస్కరించుకుని క్రైస్తవులు జరుపుకొనే ఈస్టర్ పండుగను ఆదివారం గోకవరం మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న క్రైస్తవ శ్మశాన వాటికల్లో తెల్లవారుజాము ఉంచి క్రైస్తవులు కుటుంబ సమేతంగా చేరుకుని సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి తమ కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



ధర్మవరం బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



గోకవరంలో శ్మశాన వాటికలో సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

# నవోదయకు ఐదుగురి ఎంపిక



నవోదయకు అర్హత సాధించిన విద్యార్థులు

**ప్రత్తిపాడు రూరల్:** జవహర్ నవోదయ విద్యాలయానికి ఒమ్మంగి శ్రీ భారతీ నవోదయ కోచింగ్ సెంటర్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని సంస్థ కరస్పాండెంట్ సుంకర వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ నుంచి జవహర్ నవోదయ విద్యాలయంలోకి 6వ తరగతి ప్రవేశ పరీక్షలు 15 మంది రాయగా, అందులో కొమరగిరి వీరబాబు (రాచపల్లి), అడ్డాల నిషిత ఉత్తరకంచి, జక్క రేవంత్ దేవ భాస్కర్ (ఒమ్మంగి), రేఖ సత్యశ్రీఅపర్ణ (పోతులూరు), దిడ్డి సుబ్రహ్మణ్యం (శరభవరం) విద్యార్థులు అర్హత సాధించినట్టు ఆయన తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సంస్థ అధినేత సుంకర వీరబాబు, ప్రిన్సిపాల్ ఆర్ బుల్లి రామన్న, ఏవో సీహెచ్ రాము, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థుల పరిశుభ్రతకు ప్రాధాన్యం

**తుని:** విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యురాలు శశికళ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వాటర్, శానిటేషన్, హైజీన్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శశికళ మాట్లాడుతూ శరీర ఆరోగ్యం కోసం శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. 380 మంది విద్యార్థినులకు శానిటేషన్ ప్యాడ్లను అందజేశారు. పరిశుభ్రత కోసం సబ్బులు, హ్యాండ్ వాష్, డిప్ వాష్ లిక్విడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయిని నూకరత్నానికి అందజేశారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కేవీఎస్ఎల్ఎస్ వర్మ, కార్యదర్శి కిశోర్‌రెడ్డి, ఎస్.వీర్రాజు, ఎం.వివేకానంద, ప్రసాద్, రామచంద్రరావు, కృష్ణబాబు, పొన్నాడ శ్రీనివాస్, నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తుని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శశికళ